



కోడూరి విద్యావతి

స్టూడెంట్స్ యూనియన్ అడ్వయిజర్ కమలాకర్ గొంతు మైకులో ధ్వనించింది స్పష్టంగా- 'కుమారి రాధ - ఫస్ట్ ప్రయిజ్ ఇన్ ఇలోక్యూషన్స్' అని. రాధ నిబ్బరంతో, ఆత్మ విశ్వాసంతో స్టేజీ మీదకు అడుగు పెట్టింది ప్రయిజు అందుకోవడానికి. మిసెస్




కలెక్టర్ చిరునవ్వుతో ప్రయిజు ఆత్మ విశ్వాసం, కళ్ళలోని
అందించింది. చూడగానే తెలివైన చురుకు ఆమెను చూపరులకు
దిగా అన్పించే రాధలో అందం ఆకర్షణీయంగా కన్పింపజేస్తాయి.
ఎక్కువగా లేకపోయినా ఆమె ఆడియెన్సు రాధను మెచ్చుకోలుగా

చూసారు. ఆమె మళ్ళీ మళ్ళీ ఎస్సే రైటింగ్‌లోనూ, క్విజ్‌కాంపిటిషన్ లోనూ, ఫాన్సీ డ్రస్‌లోనూ, మోనోయాక్టింగ్‌లోనూ, పొయట్రీ రీడింగ్‌లోనూ-అన్ని సబ్జక్టులలో ప్రొఫిషియన్సీకి ప్రయిజులు తీసుకోవడానికి స్టేజీమీదకు రావడంతో చివరకు 'బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది కాలేజీ' అని కమలాకర్ చదవగానే 'మిస్‌రాధ' అని స్టూడెంట్సందరూగొంతుకలిపారు. కరతాళ ధ్వనులుమిన్నుముట్టాయి. కాలేజీడే సంబరం పూర్తయేటప్పటికి రాత్రి పదయింది. అమ్మాయిలందరూ గుంపులు గుంపులుగా నవ్వుకుంటూ, ఇళ్ళకు బయల్దేరారు, వచ్చిన ఒకటో అరో ప్రయిజులు చేతుల్లోపట్టుకుని. రాధ కొంచెం వెనగ్గా నిలబడింది చేతులనిండా ఎర్రరేపర్లు చుట్టిన పాకెట్లు పట్టుకుని, ఎవరికోసమో నిరీక్షిస్తూ.

"ఎవరికోసమో చూస్తున్నారు?" ప్రశ్నార్థకంగా వాక్యాన్ని ముగించాడు శ్యాంసుందర్.

చటుక్కున బుగ్గలు ఎర్రబడ్డాయి రాధకు. 'మీ కోసమే' అని చెప్పాలనుకుంది. కానీ పెదవిదాటి భావం బయటపడలేదు.

"మా యింటివేపుగా వెళ్ళే వాళ్ళెవరయినా వుంటే కలిసి పోదామని నిలబడ్డాను."

"అయితే పదండి- నేను అటుగానే వెళ్ళాలికదా!"_ బయల్దేరారిద్దరూ. రాధ వ్యక్తిత్వాన్ని శ్యాంసుందర్ యిష్టపడతాడు. అందుకే ఆడపిల్ల లందరితోనూ ఎంతో చనువుగా వుండే అతను రాధ విషయంలో మాత్రం గౌరవాన్ని చూపిస్తాడు. మౌనంగా కొంత దూరం నడిచాక అతనే నిశ్శబ్దాన్ని భంగం చేసాడు___

"కంగ్రాచ్యులేషన్సండీ! ఒక్కసారే మాక్సిమమ్ ప్రయిజులు కొట్టేసారు. నిజానికి ఆ ప్రయిజులు మీ వ్యక్తిత్వాన్ని కొలవడానికి సరయిన సాధనాలు కావనిపిస్తుంది నాకు."

రాధ మనసు ఉప్పొంగిందా ప్రశంసావాక్యాలకు. "మీ అభిమానానికి కృతజ్ఞురాల్ని" అంది. ఇంకా ఏదో మాట్లాడాలనుకుంది. కానీ అతని ముందామెకు గొంతు పెగలలేదు.

"బియ్యే అయ్యాక ఏం చేద్దామనుకుంటున్నారు?" అడిగాడు శ్యాం.

"పొలిటికల్ సైన్సుతో ఎమ్మే చేద్దామనుకుంటున్నాను. మీరు లా చేస్తారని విన్నాను. నిజమేనా?"

"అవునండీ! ఇంతవరకూ అదే

అభిప్రాయంలో వున్నాను. కాని మా నాన్నగారు నన్ను బాంకింగ్ ఎగ్జామ్స్‌కి ఇమ్మంటున్నారు. ఆయన్ని కష్టపెట్టడం నాక్కూడా యిష్టం లేదు. బహుశా ఆయన మాటే నిలుస్తుందనుకుంటాను."

ఆశా భంగమయింది రాధకు. యూనివర్శిటీలో అతన్ని మళ్ళీ కలవొచ్చుననీ, వీలయితే తన కలలుపండే అవకాశాన్ని సృష్టించుకోవాలనీ అనుకుంది. కానీ....కానీ, అతను 'లా' చదవకపోతే అతన్ని మళ్ళీ కలుసుకునే అవకాశమే దొరక్కపోవచ్చు. గుండె కొట్టుకుంది అదోరకమైన ఉద్వేగంతో.

'అయినా తనలో మగవాళ్ళనాకర్షించే అందంలేదు. ఎందుకతని మీద ఆశల్ని పెంచుకుని ఆ తర్వాత బాధపడడం' అనుకుంది మళ్ళీ.

"ఏదో ఆలోచిస్తున్నారు?" అన్నాడతనే.

"అబ్బే! ఏం లేదు." తడబడిందామె.

"బియ్యే అయిపోయిన తర్వాత మనం విడిపోతాం. మళ్ళీ ఎన్నాళ్ళకు, ఎక్కడ, ఎలా కలుసుకుంటామో మనకే తెలీదు. అయినా ఈ పాత స్నేహితులు, సరదాలు, ఈ వయసులోని మన కలలు అన్నీ మనోయవనిక మీద అస్పష్టంగా గోచరిస్తూనే వుంటాయి, మన బ్రతుకుల చరమ ఘట్టం వరకూ. అప్పుడు మనం ఈ నాటి విషయాలన్నిటినీ తలచుకుని అతి చిన్న విషయాలనుంచే ఆనందాన్ని పొందిన మన అపరిపక్వతకు నవ్వుకుంటాం. వయసు గడిచే కొద్దీ జరిగిపోయిన విషయాలు 'మనం అలా కాక ఇంకోలా చేసి వుండాల్సింది' అనే ఫీలింగ్‌ను మనలో సృష్టిస్తాయి. చివరికి బ్రతుకును మన యిష్టం వచ్చినట్టు మలచుకోలేక, దానితో రాజీపడినట్టు గుర్తిస్తాం. అంతే నంటారా?" అన్నాడు.

'స్పినోజా' తత్వంలోని 'కాజ్ అండ్ ఎఫెక్ట్'గుర్తొచ్చింది రాధకు. 'అవును, అతని మాటల్లో చాలా సత్యం వుంది' అనుకుంది.

"మీరన్నది అక్షరాలా నిజం. కాని,ఓటమి అనేది ప్రతి ఆటలోనూ ఎవరో ఒకరికి తప్పని సరి. ఈ జీవితం, చుట్టూ వున్న మనుష్యులతో ప్రతి వ్యక్తీ ఆడే ఒక టీమ్ గేమ్. మనం ఎంత జాగ్రత్తగా దానిని నడిపించుకోవాలనుకున్నా ఏదో ఒక సంఘటన మన ప్రమేయం లేకుండానే మన జీవితాలను మార్చేస్తూ వుంటుంది" అంది రాధ.

దానికి జవాబివ్వలేదు శ్యాం సుందర్. ఏదో ఆలోచనలతో రెండు చేతులూ జేబుల్లో పెట్టుకుని సీరియస్‌గా నడుస్తున్నాడు. రాధ యిల్లు వచ్చిన సంగతిగానీ, రాధకు తోడుగా తాను వచ్చానన్న సంగతి గానీ అతనికి గుర్తున్నట్టే లేదు. తాను ప్రక్కనే వున్నా, తన ఉనికిని మరిచిపోయి ఆలోచనలలో పడి పోయిన శ్యాంను చూస్తే అతనేదో విషయాన్ని మనసులో పెట్టుకుని బాధపడుతూ వున్నట్టు తోచిం దామెకు.

"వస్తానండీ యిక- గుడ్‌నైట్, బెస్టాఫ్ లక్ ఇన్ ది కమింగ్ ఎగ్జామ్స్" అంది రాధ.

"అరె! యిల్లొచ్చేసిందా? ఐ యామ్ సారీ. ఐ ప్రూవ్డ్ మైసెల్ఫ్ ఎ వెరీ బాడ్ కంపేనియన్" అని నొచ్చుకున్నాడు.

"ఫర్వాలేదు లెండి. ఏదో ఆలో చనల్లో పడ్డారు మీరు. ఎనీ వే ఐ డిన్ట్ మైండ్."

"విష్ యూ ఆల్వేస్ బెస్ట్ ఆఫ్ లక్ అండ్ గుడ్ నైట్!" అంటూ రాధ లోపలికెళ్ళే వరకూ నిలబడి ఆ తర్వాత తన రూమ్‌వైపు కెళ్ళి పోయాడు.

ఆ రాత్రి హాల్లోని గడియారం రెండు గంటలు కొట్టడం స్పష్టంగా విన్పించింది రాధకు. శ్యాంసుందర్ అంటే తన కభిమానం. దాన్ని ఖచ్చితంగా యువతీ యువకుల పరి భాషలోని ప్రేమతో ఈక్వేట్ చేయడానికి లేదు. అతని కంపెనీలో వుంటే, అతనితో మాట్లాడక పోయినా గుండెల్లో సంతోషం చెందుతుంటుంది. అలాగని అతణ్ణి భర్తగా పొందాలనే స్పష్టమయిన కోరిక ఆమెలో లేదు. ఒకవేళ అలాంటి కోరికేదయినా వున్నా 'తానాతనకి తగననే' ఓ కాంప్లెక్సు తెరలో అస్పష్టమైపోయి, ఆమెకు కూడా తెలీకుండా వుండివుండొచ్చు. అందుకే ఆమెకు భయం-'నాకతని మీద ఎలాంటి భావం వుంది?' అని ధైర్యంగా తన్నుతాను ప్రశ్నించుకో డానికి. మనసంతా అనీజీగా ఏదో వెల్తిగా అన్పించిందామెకు. ఎప్పటికోగాని నిద్రపట్టలేదు. 'పరీక్ష లొచ్చేస్తున్నాయ్. క్లాసురావాలంటే ఇక కాన్‌సెంట్రేషన్‌తో చదవాలి' అనుకుంటూ నిద్రలోకి జారింది.

* * *

పొలిటికల్ సైన్సు ఎమ్మేలో అనుకున్నట్టుగానే జాయినయింది రాధ. ప్రతి సెమినార్‌లోనూ ఉత్సాహంతో కూడిన ప్రశ్నలు వేస్తూ, ఆరోజు పేపర్ చదివిన

స్టూడెంటు దానికి సరయిన సమాధానం యివ్వలేకపోతే తానే చక్కని సమాధానాలిస్తూ, లెక్చరర్లందరి అభిమానాన్ని అతి త్వరలో పొందగలిగిందామె. ఎమ్మే క్లాసులో ఆమెకున్న ఒకే ఒక్క రైవల్ రమణమూర్తి. ఆడపిల్లలంటేనే ఆమడ దూరంలో వుండే రమణమూర్తిని చూస్తే రాధకు అప్పుడప్పుడు నవ్వొచ్చేది. అతన్ని శ్యాం సుందర్‌తో పోల్చి చూసుకునేది మనసులోనే మాటి మాటికీ. కాని తర్వాత తెలిసింది—అదంతా అతనికి ఆడపిల్లలంటే సిగ్గు, లేదా భయం కాదని. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోవడం అతని తత్వానికి విరుద్ధమట. అతను వ్రాసిన విశ్లేషణాత్మక వ్యాసాలు పేరు పొందిన పొలిటికల్ సైన్సు జర్నల్స్‌లో ప్రచురితం ఔతున్నాయని తెలిసినరోజు, అతన్ని తక్కువగా అంచనా వేసుకున్నందుకు సిగ్గుపడింది. అతనితో మాట్లాడి తన విజ్ఞానాన్ని పెంచుకోవాలనుకునేది.

ఒకరోజు లైబ్రరీలో అతనేదో రిఫరెన్సు వర్కు చేసుకోవడం చూసింది. లైబ్రరీ అంతా ఖాళీగా వుంది. అప్పుడే అతను కేంద్ర-రాష్ట్రసంబంధాల మీద వ్రాసిన వ్యాసాన్ని చదివి వచ్చింది రాధ. అందులో కొన్ని విషయాలపై ఆమెకు సందేహం కలిగింది. ఎప్పుడయినా వీలయితే అతనితో ఆ వ్యాసాన్ని 'డిస్కస్' చేయాలనుకుంది. 'ఇప్పుడే ఎందుకు చేయకూడదాపనీ?' అనుకుంది వెంటనే. 'డిస్టర్బ్ చేస్తే విసుక్కుంటాడేమో' అని భయపడింది. అతన్ని చూస్తే తన క్లాస్ మేట్‌లా కాకుండా ఎవరో పెద్దవాడు లాగా అనిపిస్తుందామెకు. చివరకు ధైర్యంచేసి, "హాలో! గుడ్ మాణింగ్!" అంది.

"గుడ్ మాణింగ్- గుడ్ మాణింగ్!" అనేసి వెంటనే పుస్తకాల్లో మునిగిపోయాడు మళ్ళీ.

"మీతో కొంచెం మాట్లాడాలనుకున్నాను - ఇఫ్ యూ డోన్ట్ మైండ్" అంది.

"ఓ, ష్యూర్. యూ ఆర్ వెల్‌కమ్!" చదువుతున్న పేజీకి గుర్తుగా పెన్సిల్ పెట్టి పుస్తకాన్ని మూసేసాడు, చెప్పదల్చుకున్నది వినదానికన్నట్టు.

"మీరు వ్రాసిన ఆర్టికల్ గురించి మాట్లాడాలని...." మెల్లిగా అంది.

"చెప్పండి-దానిమీద మీ అభిప్రాయాలు?" ఎంకరేజ్ చేసాడు. ఆ అడగటంలో 'మీ అభిప్రాయాలేవయినా నాకేం అభ్యంతరం

లేదు. నేను మాత్రం నాస్టాండ్‌ను మార్చుకోను' అనే భావం కూడా కల్పించిందామెకు.

"మీరు రాష్ట్రాలు బలంగా వుండాలన్నారు. నా ఉద్దేశ్యంలో కేంద్రమే బలంగావుంటే బాగుంటుంది. కేంద్రాన్ని బలహీనంగా చేయడంవల్ల, వనరులవిషయంలో రాష్ట్రాలకే పూర్తి అధికారం ఇవ్వడంవల్ల, రాష్ట్రాలమధ్య సమన్వయ భావం నశించడానికీ, చివరకు చిన్న రాష్ట్రాలు దారుణమయిన ఆర్థిక లోపాలకు గురికావడానికీ ఆస్కారంవుందని నాభావన. స్వయంపోషకత్వం లేని రాష్ట్రాలు అటు కేంద్రంనుంచి సరయిన సహాయం కూడా అందక, పోటీలో అణగారిపోయే ప్రమాదం లేదంటారా?" అందామె.

"మీదిఏకపక్షవాదం మాత్రమే. రాష్ట్రాలకు సరయిన అధికారాలు లేక పోవడం వల్లనే మన రాజకీయాల్లో ఇంత అస్వచ్ఛత ఏర్పడింది. ఏరాష్ట్రాని కారాష్ట్రం సరయిన 'ఇండివిడ్యుయాలిటీ'తో బ్రతక్కుండా ప్రతి దానికీ కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో వున్న రాజకీయపార్టీకి లొంగి, చివరకు తన మంత్రి వర్గాన్నేర్పరుచుకునే ముందు కూడా ఐదారుసార్లు కేంద్ర రాజధానికి ప్రయాణాలు కట్టించుతోంది తన ముఖ్య మంత్రులచేత. ఏదయినా ఒక రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షమైన రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే ఆ రాష్ట్రంలోని కొందరు ప్రజలు తమ రాష్ట్రానికి సరయిన కేంద్ర సహాయం అందదేమోనని సందేహాలు వెలిబుచ్చుతున్నారు. వీటన్నిటికీ కారణం కేంద్రానికున్న అధికార జాబితాలో అంశాలు రాష్ట్ర జాబితాకంటె ఎక్కువగా వుండటమే. ఒకే దేశంలో ఒకే పనికి విభిన్నమయిన జీతాల స్కేళ్ళున్నాయి ప్రస్తుతం. రాష్ట్రాల ప్రజలెందరో ఎన్నో ఆందోళనలు చేస్తున్నారు. అయినా దీనికి కేంద్రం ఎలాంటి సమాధానాన్నీ యివ్వడంలేదు. దీనిక్కారణం-కేంద్రం యొక్క తప్పించుకునే ధోరణేగాని మరేమీకాదు. వీలయినన్ని ఎక్కువ అధికారాలను పొందడానికి ప్రయత్నిస్తూనే సామాన్యమానవునికి సంబంధించి సామాన్య సమస్యల విషయంలో 'అవి మీ రాష్ట్రాల యిష్టం' అని తప్పించుకుంటూవుంది. ప్రజల్ని అసంతృప్తికి గురిచేసే సమస్యల్ని రాష్ట్రాలకేవదిలి, తమ ప్రెస్టేజ్‌కి ప్రమాదంరాని అధికారాలన్నిటినీ

కేంద్రం హస్తగతంచేసుకోవడంలో అవకాశవాదమేకానీ, పురోభివృద్ధి కన్పించదు నాకు. అందుకే నా అభిప్రాయంలో- కేంద్రం దేశీయ వ్యవహారాలు, విదేశాంగ వ్యవహారాలు, రక్షణ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి — అనే నాలుగు విషయాలనూ తీసుకుని, మిగతా అన్నిటినీ రాష్ట్రాలకే వదిలేయాలి. దీనివల్ల ప్రతిరాష్ట్రం తనకున్న వనరులకు గరిష్ట ఉపయోగాన్ని కల్పించుకుంటూ తన్ను తానభివృద్ధి చేసుకోగలదు. నా వాదంతో మీరు ఏకీభవించలేకపోతే మీ పాయింట్సు అన్నీ ఒక పేపరుమీద వ్రాయండి. మరోసారి తీరిక వున్నప్పుడు డిస్కస్ చేసుకుందాం" అని తన వాదాన్ని ఆపాడు రమణమూర్తి.

"అంటే 'యిక ఈ విషయం మీద ప్రస్తుతం మాట్లాడదలచుకోలేదు' అని పరోక్షంగా చెప్తున్నారా?" నవ్వుతూ అంది రాధ.

"ప్లీజ్ డోన్ట్ టేక్ అఫెన్స్ రాధగారూ! నేను ప్రస్తుతం ఒక ఇష్యూమీద వివిధ మేధావుల అభిప్రాయాలు సేకరిస్తున్నాను. దీనిని రేపు సాయంత్రానికి పూర్తిచేయాలనుకుంటున్నాను. ఏ పనయినా అనుకున్న షెడ్యూల్ ప్రకారం చేయలేకపోతే నాకు చాలా బాధగా వుంటుంది. అందుకే మరోసారి డిస్కస్ చేద్దామనుకుంటున్నాను. క్షమించాలి -మిమల్ని బాధపెడితే" అన్నాడు మర్యాదగా. ఆ మాటల్లోని ఖచ్చితత్వం ఆమెనిక సంభాషణకు పురికొల్పలేదు.

"ఆల్‌రైట్! థేంక్యూ వెరీ మచ్ ఫర్ ట్రయింగ్ టు క్లారిఫై యువర్ ఒపీనియన్ టుమీ. అలాగే మీరన్నట్టు మరోసారెప్పుడయినా ఈ విషయాన్ని మాట్లాడుకుందాం. బై -బై" అంటూ పుస్తకాల రేక్ వైపుకు కదిలింది తనక్కావల్సిన బుక్స్‌కోసం.

* * *

ఎమ్మే రిజల్ట్సు వచ్చాయి. అనుకున్నట్టుగానే రాధకి ఫస్టుక్లాసు, రమణమూర్తికి యూనివర్శిటీ ఫస్టు వచ్చాయి. రాధ, రమణమూర్తుల లాంటి స్టూడెంట్సు యింతవరకూ ఏ బేచ్‌లోనూ కన్పించలేదని ఇంటర్నేషనల్ రిలేషన్సు టీచ్ చేసే రీడర్ మాధవరావుగారు మెచ్చుకున్నారు కాన్వొకేషన్ కెళ్ళినప్పుడు. దానికి వాళ్ళ క్లాస్‌మేట్స్ ఎవరూ అసూయపడలేదు, పైపెచ్చు వాళ్ళుకూడా అదేమాటన్నారు. ఇందరి అభిమానాన్ని పొందిన రాధ, రమణమూర్తులు పరస్పరం

స్నేహ బాంధవ్యాలను పెంచు కోవడంలో మాత్రం వెనకబడే వున్నారు.

* * *

రెండేళ్ళ తర్వాత....రాధ, రమణమూర్తుల వెడ్డింగ్ కార్డు నందుకున్న ఫ్రెండ్స్ అందరూ చాలా ఆశ్చర్యానికి లోనయ్యారు- యూనివర్శిటీలో వుండగా ఒకరితో ఒకరు ఎక్కువగా మాట్లాడుకోని రాధ, రమణమూర్తులు పరిచయాన్ని ఎప్పుడు, ఎలా పెంచుకున్నారో తెలీక. స్నేహితులందరూ దానిని ప్రేమ వివాహమే ననుకున్నారు. వారి జంట ఆదర్శప్రాయంగా వుంటుందనిసంతోషించారు. ఎంతో ఉత్సాహంతో అధిక సంఖ్యలో వారంతా పెళ్ళికి హాజరయ్యారు. కానీ తర్వాత తెలిసింది-అది అరేంజ్డ్ మేరేజేనని. రమణమూర్తి అమ్మమ్మ, రాధ తండ్రి మేనత్తకి ఆడపడుచట. రాధకి సంబంధాలు చూస్తుంటే, తండ్రి మేనత్త తన ఆడపడుచు మనవణ్ణి గురించి చెప్పి అతనుకూడా ఎమ్మే చదివాడందట. పెళ్ళి చూపుల కొచ్చే వరకూ వారే వీరనే విషయం ఇద్దరికీ తెలీలేదు. తీరా తెలిసాకఅభ్యంతర పెట్టాల్సిన అవసరం కూడా కన్పించలేదు వాళ్ళకి. రాధకి మొదటినుంచీ రమణమూర్తి తెలివితేటల పట్ల సదభిప్రాయం వుండడంతో ఆమెఈమాచ్ కలిపినందుకు సంతోషించింది. రమణమూర్తి కూడా అంగీకరించాడు. వారి వివాహానికి సాంప్రదాయంకూడా జోడైనందుకు స్నేహితులు మరింత సంతోషించారు. పెళ్ళి చేసుకునే వారికంటె స్నేహితుల సంతోషమే చాలా రిమార్కబుల్‌గా కనిపించింది. చివరకు వాళ్ళిద్దరికీ శుభాకాంక్షలు చెప్పివచ్చిన వారంతా పెళ్ళయిన వెంటనే తిరుగు ముఖం పట్టారు.

* * *

ఆ తర్వాత....మరో అయిదేళ్ళకు...

ఒక రోజు రాధ రెడీమేడ్ బట్టల దుకాణంలో నాలుగేళ్ళ పాపకు ఫ్రాకులు సెలెక్ట్ చేస్తూ వుంది. వెనకనుంచి "హలో, రాధా!" అని విన్పించిన పిలుపుకు ఉలిక్కిపడి వెనక్కు తిరిగింది.

"అరె! నువ్వా శ్యాం?" అంది సంతోషంగా.

బియ్యేనాటి క్లాస్‌మేట్ శ్యాం సుందర్ ముఖంలో మెచ్యూరిటీ, గొంతులో గాంభీర్యతా కొట్టొచ్చినట్టు కన్పించాయి! సన్నని మీసం ముఖానికో క్రొత్త అందాన్ని

తెచ్చింది. అలాగే చూస్తూ నిలబడి పోయింది రాధ.

"అరే! గుర్తు పట్టి కూడా అలా నిలబడి పోయావేమిటి? ఈ పాప ఒక్కతేనా నీకు? హలో, స్వీటీ!" అంటూ రాధ కూతురు కాంతి బుగ్గపై చిటికవేసాడు.

"పెళ్ళయిందటగా? ఎక్కడు న్నారు మీ ఆయన? ఏం చేస్తు న్నారు? చాలా రోజులకు కలిసాం కదా-ఏమీ మాట్లాడడం లేదేమిటి?" ఏక ధాటిగా ప్రశ్నల వర్షం కురి పించేసాడు శ్యాంసుందర్.

"ఆఁ" అంది, అప్పుడే సడె న్గా అతన్ని గుర్తించినట్టు. 'నువ్వా శ్యాం' అని అతన్ని ఏక వచనంలో సంబోధించినట్టు గుర్తొచ్చి 'ఇలా ఎలా జరిగింది?' అనుకుంది. కానీ శ్యాంకూడా తనతో ఏక వచనం లోనే మాట్లాడు తున్నాడు. 'బియ్యే తర్వాత మళ్ళీ కలుసుకోనేలేదు. కానీ ఈ చను వెలా పెరిగింది?' అని తనను తానే ప్రశ్నించుకుంది. అతనడిగిన ప్రశ్న లకు జవాబివ్వాలని తట్టింది.

"పాప నాన్నగారు లండన్‌లో వున్నారు. లండన్ యూనివర్శి టీలో రిసెర్చిఫెలోషిప్ దొరికిం దాయనకు. మూడేళ్ళ నుంచి అక్కడే వున్నారు. ఒకసారి మా యింటికి రారాదు-తీరిగ్గా మాట్లాడు కోవచ్చు" అంది అక్కడ మాట్లా డడం యిష్టంలేనట్టు.

"ఎప్పుడో యెందుకు? ఇప్పుడే వస్తా" అన్నాడు నవ్వుతూ పాప చెయ్యి పట్టుకుని.

"సరే, ఇప్పుడే వెళ్దాం నడు. ఇల్లు చూస్తే నెక్స్ట్‌టైమ్ మీ ఆవిణ్ణి తీసుకురావచ్చు" అంటూ ఆటోను పిల్చింది రాధ.

మరో పదినిముషాల్లో చిన్న డాబా యింటి ముందాగింది ఆటో.

గేటు లోపలి మందారాలు గాలికి అటూ యిటూ ఊగుతూంటే పాప సంబరంగా వాటినందుకో బోయింది.

"పువ్వుల్ని కోస్తే, అవి ఏడుస్తాయమ్మా!" అంటూ పాప నెత్తుకుని "రండి లోపలికి" అని శ్యాంను ఆహ్వానించింది రాధ.

పాపను దించి, తెచ్చిన పాకెట్లు లోపలిగదిలో పెట్టి మళ్ళీ హాల్లోకి వచ్చింది. హాల్లో గోడకున్న ఫోటోలు చూస్తున్నాడు శ్యాం.

రాధను చూడగానే "నువ్వూ, మీ వారూ తీయించుకున్న ఫోటోలు ఏమయినా కనిపిస్తా యేమోనని చూస్తున్నాను" అన్నాడు.

రాధ జవాబివ్వలేదు దానికి. "కూర్చో శ్యాం, ఇప్పుడే వస్తాను"

అంటూ లోపలికెళ్ళింది. తిరిగి వచ్చిన రాధ కళ్ళు తోటలోని ముద్ద మందారాల్ని జ్ఞప్తికి తెచ్చాయి శ్యాంకు.

"'ఎందుకలా వున్నావు?' అని అడగొచ్చో కూడదో తెలీడం లేదు రాధా! అయినా మన బియ్యే స్నేహం అడిగి చూడమంటోంది. ఇన్నాళ్ళ ఎడం అంత చనువు తీసుకో వద్దంటూవుంది. స్నేహానికే ప్రాధాన్యతనిచ్చే తత్వం నాది. ఏమైంది రాధా? నీ మనసెందుకు కష్టంలో వుందో ఈ పాతకాలపు స్నేహితుడికి చెప్పుకుంటే, నీ బాధ కొంతయినా తీరుతుందని నా ఆశ." ఒక విధమైన కన్‌సర్న్ కంఠంలో తొణికిసలాడుతుండగా అడిగాడు శ్యాంసుందర్.

కొన్ని నిముషాల మౌనం తర్వాత రాధ తేరుకుంది. మెల్లిగా మందస్వరంలో చెప్పడం మొదలు పెట్టింది- "ఈ జీవితం, చుట్టూ వున్న మనుష్యులతో ప్రతి వ్యక్తీ ఆడే ఒక టీమ్ గేమ్. ఎంత జాగ్రత్తగా వున్నా మన ప్రమేయం లేకుండానే ఏదో ఒక సంఘటన మన జీవితాలను మార్చేస్తూ వుంటుంది__అని ఒకసారి నీతోనే కదూ శ్యాం అన్నాను! ఆ మాటలు మరీ యింత గట్టిగా నా జీవితం మీదే ప్రభావం చూపిస్తే తట్టుకోలేకుండా వున్నాను. ఎన్నో ఆశలతో రమణమూర్తిని పెళ్ళి చేసుకున్నాను. అతనితో జీవితం నందనవనం అవుతుందనుకున్నాను. కాని చాలా కర్కశంగా నా ఆశల్ని కూలద్రోసి ఆయన లండన్ వెళ్ళిపోయారు.

"మగవాడికి తన భార్య తెలివైనది కావడం ఇష్టం వుండదని అనుభవంద్వారా తెలుసుకున్నాను. ప్రతి విషయంలోనూ ఆయన సిద్ధాంతాల్ని వాదనలద్వారా విమర్శిస్తూ వుండే దాన్ని. విమర్శల వల్ల ఆయన అభిప్రాయాలు మరింత మెరుగు పడతాయనే అనుకొన్నాను గాని, విమర్శనే సహించలేని వ్యక్తి అని తెలుసుకోలేకపోయాను.

"వాదన జరిగిన ప్రతిరోజూ ముభావంగా వుండేవారు. మాట్లాడేవారు కాదు. చివరకు హఠాత్తుగా పాపపుట్టిన 1 సం॥కి, అంటే పెళ్ళయిన 2 సం॥లకు ఫెలోషిప్ దొరికిందని చెప్పి వెళ్ళిపోయారు. పాస్‌పోర్టు, వీసా తెచ్చుకోవడం కూడా నాకు తెలీకుండానే జరిగిపోయింది. నామీద ప్రేమ లేకున్నా కనీసం పాపమీదైనా ఉంటుందనుకున్నాను. ఆయన మనస్సు తెలుసు

కోవడానికి నేను చేసిన ప్రయత్నాలు పూర్తిగా నెరవేరకముందే ఆయననాకుదూరమయ్యారు.ఆయనకంతగా ఇష్టంలేదని తెలిస్తే ఏ మాటకూ ఎదురు చెప్పకుండానే ఉండేదాన్ని. కాని చిన్ననాటినుండి అలవాటయిన విమర్శనా దృష్టి ఆయన థియరీలో నాకు నచ్చని విషయాల్ని గురించి వాదించేటట్లు పురికొల్పడంతో చివరికిలా ఒంటరి జీవితం ఎదురయ్యింది. నేను కూడా ఆయన దగ్గరకు వచ్చేస్తానని ఉత్తరం వ్రాశాను. దానికాయన 'మన వివాహం ఫెయిల్ అయిందనే విషయాన్ని నువ్వర్థం చేసుకోవడంలేదు. ఐవజ్ నెవ్వర్ హేపీ విత్‌యూ' అని వ్రాసారు. అప్పటినుండి నేనెన్ని ఉత్తరాలు వ్రాసినా ఆయన జవాబే వ్రాయడం లేదు. ఇదీ నీ స్నేహితురాలి కథ." రాధ కళ్ళనిండుగా మళ్ళీ నీళ్ళు.

"ఔను, ప్రేమించిన వ్యక్తి నుంచి దూరంగా బ్రతకడం అనే నరకం అనుభవంలోకి వస్తేగాని ఎంత బాధాకరంగా వుంటుందో తెలీదు. అందుకే నిన్ను నేనేమీ ఓదార్చలేకపోతున్నాను. అయినా ఆశ మనిషికి ఊపిరి కాబట్టి, మంచి రోజులు వస్తాయనే నమ్మకంతో కాలం గడపడం కంటె ఎవరం మాత్రం ఏం చేయగలం? నీకు మంచి రోజులు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను రాధా!" బరువుగా అన్నాడు శ్యాం.

కాస్సేపున్న తర్వాత వెళ్తానని లేచిన శ్యాంతో "మీ ఆవిడను తీసుకురా ఎప్పుడయినా" అంది రాధ.

నవ్వాడు శ్యాం. "తప్పకుండా నీ కోరిక చెల్లిస్తాను- పెళ్ళి చేసుకున్నాక" అన్నాడు.

ఆశ్చర్యపోయింది రాధ- శ్యాం యింకా పెళ్ళి చేసుకోనందుకు.

బయటికి కొచ్చాడు శ్యాం. ఒకప్పుడు తాను రాధ నారాధించాడు. కాని రాధ తెలివి తేటలకు తాను తగనని, ఆమెకు ఎవరో ఒక మేధావి భర్త అయితే ఆమె జీవితం సుఖ సంతోషాలతో వర్ధిల్లుతుందనీ ఆశించాడు. కాని జరిగింది యిది. 'అందుకే విధి చేతిలో మనిషి కీలుబొమ్మ' అన్నారు. శ్యాం ఆలోచనలీ విధంగా సాగుతున్నాయి.

కాని రాధ తన దురదృష్టం గురించే విచారిస్తూ, రమణమూర్తి చుట్టూ ఆలోచనల్ని పరిభ్రమింపజేస్తూవుంది. శ్యాం తన పట్ల ఒకప్పుడు ప్రేమను కలిగివున్నాడనే విషయం తెలిస్తే- అప్పుడు రమణమూర్తి దూరమైనందు కంటే శ్యాం తనకు దక్కనందుకేబహుశా ఎక్కువ బాధపడి వుండేదేమో ఆమె!